క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే గ్రామాలివే

చిలకలూరిపేట: మండలంలోని వేలూరు ఫీడర్ విద్యుత్ కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా పలు గ్రామాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. వేలూరు, కుక్కపల్లి వారిపాలెం, పంగులూరివారిపాలెం, గణేషుని వారిపాలెం, యడ్లపాడు మండలంలోని సందెపూడి, తుర్లపాడు గ్రామాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు



వినుకొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన వినుకొండ సమీపంలోని బాలాజీ ఎస్టేట్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వినుకొండ పట్టణంలోని ఇసుకవాగు బజారులో నివాసం ఉంటున్న ఉప్పలపాటి రామాంజనేయులు, కార్తీక్ అన్నదమ్ములు వ్యక్తిగత పనుల నిమిత్తం శావల్యాపురం వైపు వెళ్తుండగా బాలాజీ ఎస్టేట్ సమీపంలో స్పీడ్‌గా వస్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. దీంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రామాంజనేయులు మృతి చెందగా అతని తమ్ముడు కార్తీక్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

జీఎస్టీ రాయితీను ప్రజలు సద్వినియోగం చేసుకోండి



శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం నుంచి సెంటరు వరకు ర్యాలీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో అమలు చేసిన జీఎస్టీ సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయం చేయు రైతులందరు వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీని ఆదా చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుగుణ, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, వీఏఏ వెంకాయమ్మ రైతులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రింటర్ వితరణ



యడ్లపాడు: తాను చదువుకున్న పాఠశాలలో పరిపాలన, బోధన పరంగా పాఠశాలకు అత్యవసరమైన ఆయా వస్తువుల్ని బహూకరించి పూర్వవిద్యార్థి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ నంబూరి నరసింహారావు రూ.24 వేల విలువ కలిగిన హెచ్‌పీ ప్రింటర్‌తో పాటు, మంత్ర ఫింగర్ డివైజ్‌ను శుక్రవారం అందించారు. ఆయా వస్తువుల్ని ఇచ్చిన దాత నరసింహారావుతో పాటు ఆయనతో మాట్లాడి ఇప్పించిన గ్రామపెద్దలు నంబూరి శివరామకృష్ణ, తోకల సత్యనారాయణలకు పాఠశాల హెచ్‌ఎం షేక్ నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు వి.ఝాన్సీ లక్ష్మి, ఎస్.కోటేశ్వరమ్మ, కె.అనురాధ, ఎం.నాగపావనీ కృతజ్ఞతలు తెలిపారు.

మేదరపాలెం షేక్ ఫరీద్ విగ్రహావిష్కరణ



వినుకొండ: పట్టణంలోని రణహుస్సేన్ బజారుకు చెందిన మేదరపాలెం షేక్ ఫరీద్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆవిష్కరించారు. బొల్లా మాట్లాడుతూ ఆయన పేరుపై చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫరీద్ కాంట్రాక్టర్‌గా, మేస్త్రిగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన మనుమడు మేదరపాలెం షేక్ మహబూబ్‌బాషా 19వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నిక అవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ప్రసాద్, సీకే రెడ్డి, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, కొత్తమాసు శివ, ఎంఎస్‌కే అక్బర్‌బాషా, ఎంఎస్‌కే సుభాని, ఎంఎస్‌కే మహబూబ్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

యడ్లపాడు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం యడ్లపాడు మండలంలో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.1.94 లక్షలతో బోయపాలెం నుంచి ఉన్నవ వరకు ఉన్న రోడ్డు, బోయపాలెం నుంచి లింగారావుపాలెంకు వెళ్లే మార్గం రూ.2.40 కోట్ల సీఆర్‌డీఏ నిధులతో చేపట్టే బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు




వినుకొండలో జరిగిన అమ్మవారి ఊరేగింపు



చిలకలూరిపేటలో పుష్పశయనాదేవి అలంకారంలో..



పండ్లతో కొలువుదీరిన రాజరాజేశ్వరీ అమ్మవారు



పాతూరు శివాలయంలో రాజరాజేశ్వరిగా...



సొలసలోని బ్రహ్మంగుడిలో రాజరాజేశ్వరి దేవిగా..



శావల్యాపురంలో రాజరాజేశ్వరీ అలంకరణ



నరసరావుపేటలో ఆకట్టుకున్న చిన్నారుల భక్తిరస నృత్యం

గాంధీ ఆశయాలకు జగనన్న సచివాలయ వ్యవస్థ ప్రతీక

- మహాత్ముడు దేశానికే కాదు.. ప్రపంచానికే ఆదర్శనీయుడు
- గాంధీజీ బోధనలు ఇంటింటికీ చేరాలి
- ఘనంగా నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ ప్రతీకని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్వర్గీయ మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా మున్సిపల్ ఆఫీస్ వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలల వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ మహాత్మా గాంధీతో పాటు దేశం మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన కూడా ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. గాంధీ జీవితం ఆదర్శనీయమని ఆయన చేసిన ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, అహింసా మార్గం ద్వారా ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహనీయులని కొనియాడారు. ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గుర్తించాయంటే అది మహాత్మా గాంధీ వల్లనేనని అన్నారు. ఆయన నమ్మి ఆచరించిన సత్యమేవ జయతే, అహింసా మార్గం అనే సిద్ధాంతాలు ప్రపంచ దేశాలు కూడా ఆచరించాయని, దక్షిణాఫ్రికా, అమెరికాలోని నల్ల జాతీయులు మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని అహింసా మార్గంలోనే స్వాతంత్ర పోరాటాలు నిర్వహించారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య వ్యవస్థను వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ఆచరణలో పెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడిచి సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా గ్రామ స్వరాజ్యాన్ని కాపాడాలని కోరారు. ప్రముఖ గాంధేయవాది ఈదర గోపీచంద్ మహాత్మా గాంధీజీ



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

బోధనలను పుస్తక రూపంలో ప్రచురించి ఇంటింటికి గాంధీజీ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఆయన బోధనలను ఇంటింటికీ తీసుకువెళ్లే ప్రయత్నం చేయటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. హింస రోజురోజుకు తీవ్రమవుతున్న ఈ రోజుల్లో మహాత్మా గాంధీజీ నడిచిన అహింసా మార్గాన్ని ప్రతి ఇంటికి తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకుని గాంధీ బోధనలను చదివి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. మద్ది రామబ్రహ్మానందరావు, నిడమానూరి సురేంద్ర, కొత్తూరి సురేష్‌బాబు, ఈదర గోపీచంద్, మాగులూరి రమణారెడ్డి, హోలీ వుడ్ రఘు, గంటెనపాటి గాబ్రియేలు, బూదాటి కల్యాణ్, బొగ్గరం మూర్తి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినుకొండలో....

వినుకొండ: శాంతి అహింస మార్గంద్వారా బ్రిటీష్ వారి కబంధ హస్తాలనుంచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీ సిద్ధాంతాలు అందరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బొల్లా

అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పార్టీ నాయకుల కార్యకర్తలతో కలసి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం అనే విధానానికి అనుగుణంగా గ్రామ సచివాలయాలు, ఏర్పాటు చేసి పరిపాలన ఇంటంటికీ అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుతపాలన చూస్తే స్వేచ్ఛ శాంతి అనే పదాలకు విరుద్ధంగా ప్రజలహక్కులను కాలరాస్తూ వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ భావప్రకటన కూడా హరిస్తూ సోషల్ మీడియాలో ప్రభుతావన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు పెట్టి వేధిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి ఎమ్.ఎస్.ప్రసాదు, పార్టీ ఎస్సీసెల్‌నాయకులు కోపెలదేవారాజ్, ఎంపీపీ జయశ్రీవెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బేతం గాబ్రియేలు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్తమాసుశివ, వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణ పనులకు శ్రీకారం

శావల్యాపురం: మండంలోని కొత్తలూరు గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ పనులకు గ్రామస్తులు దాతలు సహకారంతో గురువారం శ్రీకారం చుట్టారు. రూ.50 లక్షల వ్యయంతో నూతన దేవాలయం నిర్మాన పనులకు అంకుర్పాణ చేపట్టారు. గణపతి, పుణ్యాహవాచన, వాస్తు హోమం, మండపారాధన, తదితర పూజలు అబ్బూరి వెంకట రామయ్య–శివమ్మ దంపతుల నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులు సహకారంతో నూతన దేవాలయం నిర్మాణ పనులకు తమ వంతు సహాయంగా రూ.10 లక్షలు విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. గ్రామవాసి గుర్రం నాగేశ్వరరావు తమవంతు సహాయంగా రూ. లక్ష రూపాయాలు విరాళం ప్రకటించారు. 1986 సంవత్సరంలో గోనుగుంట్ల రత్తయ్య వెంకటేశ్వరస్వామి దేవాలయం ఏర్పాటు చేశారని, ప్రస్తుతం దేవాలయం శిథిలావస్థకు చేరిందని, ప్రవాస భారతీయులు గ్రామస్తులు దాతలు సహకారంతో నూతన



పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వెంకట రామయ్య దంపతులు

దేవాలయం నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నవంబరు నెలలో భూమి పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం నాగేశ్వరరావు, దివ్వకోలు రవీంద్ర, లక్ష్మినారాయణ, గోపు స్వాములు, దివ్వకోలు వెంకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాచారం కోరినా ఇవ్వని మున్సిపల్ అధికారులు

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం కోరినా ఇవ్వని మున్సిపల్ అధికారుల వైఖరిని నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబయ్యకు చెందిన వివరాలు కోరుతూ ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మున్సిపల్ పౌర సమాచార అధికారికి దరఖాస్తు దాఖలు చేశారన్నా రు.

అయితే కార్యాలయం నుంచి తమ వద్ద సమాచారం లేదంటూ సమాధానం ఇచ్చారన్నారు. పౌరులు అడిగిన సమాచారం ఇవ్వకుండా దాటవేయటం సరైంది కాదని అన్నారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబయ్యపై రకరకాల ఆరోపణలు ఉన్నాయని, అనేక అక్రమాలకు పాల్పడినట్లు, ఆస్తులు బెట్టినట్లు కూడా చర్చ జరుగుతుందని అన్నారు. కత్వ



ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

చెరువు, డ్రైనేజీ కాలవలు ఆక్రమణలు చేసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, అందువల్లనే వారి సర్వీస్ రికార్డు, ఇతర వివరాలు ఇవ్వడంలేదని తమకు తెలుస్తుందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అతని ఆస్తులు, ఇతర వివరాలు అన్ని తెలియజేయాలని, ప్రభుత్వం వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలుగా తాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమార్జనలో వారిద్దరూ సిద్ధహస్తులు


- చేపలచెరువులు అడ్డుపెట్టుకుని మక్కెన..
- బయో ఎరువులు అమ్ముతూ ఎమ్మెల్యే జి.వి
- అంతులేని అవినీతికి పాల్పడుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లా విమర్శ

వినుకొండ: వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన ఇద్దరూ కలసి అక్రమార్జనకు తెరలేపారని మాజీఎమ్మెల్యే బొల్లా విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమగా కౌగిలింతలు కడుపులో కత్తులు అంటూ.. ఎమ్మెల్యే జీవీ, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెనల పై తనదైన శైలిలో విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన చేపల చెరువులను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని గ్రామాల్లో చేపల చెరువులు ఏ ఒక్కరి సొత్తు కాదని అవి ప్రజల ఆస్తి అని వాటి పై హక్కు ప్రజలకు ఉంటుందన్నారు. అలాంటి చెరువులను హస్తగతం చేసుకుని కోట్ల రూపాయలు అక్రమ మార్గాలద్వారా ఆర్జించారని అన్నారు. ఎమ్మెల్యే జీవీ మాజీఎమ్మెల్యే మక్కెన ఇద్దరూ తోడుదొంగాల్లా తయారయ్యారన్నారు.

నియోజకవర్గంలోని చేపల చెరువులను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు దోచుకుంటుంటే, ఎమ్మెల్యే తన సొంత బయో ఎరువులు అమ్ముంటూ అక్రమార్జనకు అలవాటు పడ్డారని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న ఎం.ఎస్.ప్రసాదు

ప్రజాప్రతినిధి... పెట్టుబడి ఎలా పెడతారు?

వినుకొండ: జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మాజీఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుపై వైఎస్సార్ సీపీ మాజీఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన ఆరోపణలను నిజాయతీగా నిరూపించుకోవాల్సి బాధ్యత మక్కెనపై ఉందని జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఎం.ఎస్ ప్రసాదు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం లాగులు వేసుకున్నప్పటి నుంచి చేపలవ్యాపారం చేస్తున్నామని చెబుతున్న మక్కెన వ్యాపారం అక్రమంగా చేస్తున్నట్లు తానే ఒప్పుకున్నాడని అన్నారు. సొసైటీ, పంచాయతీ చెరువులకు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తున్నానని ఆయనే చెబుతున్నారని. సొసైటీకు, మత్స్యకారులకు, స్కిల్స్ ఉన్నవారికి మాత్రమే చేపలు పట్టుకునే హక్కు ఉంటే ప్రజాప్రతినిధిగా ఉండి చేపలవ్యాపారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. వాస్తవంగా చేపలు పట్టుకునే వారికి సొసైటీ మెంబర్లుగా ఉన్నవారికి న్యాయం ఎక్కడ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కొత్తమసు శివ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బేతం గాబ్రియల్, వినుకొండ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు కొత్త కృష్టారెడ్డి, జిల్లా కార్యదర్శి తలారి ఆంజనేయులు, చీరపురెడ్డి పుల్లారెడ్డి,తో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

సింథటిక్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు గర్వకారణం

చిలకలూరిపేట: సీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే రెండో సింథటిక్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేయడం గర్వకారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సీఆర్ క్లబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సింథటిక్ టెన్నిస్‌కోర్టును గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు సీఆర్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారుల్ని తయారుచేయడంతో పాటు వారికి అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించటంలో సీఆర్ క్లబ్ ఎప్పటి నుంచో అవిరళ కృషి చేస్తున్నదని కొనియాడారు. క్రీడాకారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని చిలకలూరిపేటతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ



సింథటిక్ టెన్నిస్‌కోర్టు ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

మార్కెట్ కమిటీ ఛైర్మన్ షేక్ కరిముల్లా, సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సాదినేని హనుమంతరావు, మక్కెన నరసింహారావు, రమేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో మేలు

యడ్లపాడు: మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లింగారావుపాలెం గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా వ్యవసాయ రంగానికి కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. పన్ను తగ్గింపు ద్వారా రైతులకు గణనీయమైన లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ వివరించారు. సూక్ష్మ ధాతువులు, బయోపురుగు మందులు, ట్రాక్టర్, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్స్ ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీని 12శాతం నుండి 5శాతానికి తగ్గించినట్లు తెలిపారు. అలాగే ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు, పంటకోత, నూర్పిడియంత్రాలు, డ్రోన్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5శాతానికి తగ్గించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జగ్గాపురం వెటర్నరీ డాక్టర్ బి.కబ్బిరెడ్డి, బి.లక్ష్మిశేషసాయి, ఎంపీటీసీ తోకల వీర రాఘవయ్య, గ్రామ పెద్దలు కట్టా శ్రీహరి, నంబూరి కృష్ణారావు, తోకల రాజేష్ సాదినేని సుధీర్, మురుకుట్ల శ్రీధర్‌కుమార్, నంబూరు శివరామకృష్ణ, తోకల సాంబశివరావు రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం

నాదెండ్ల: సవరించిన జీఎస్టీ 2.0తో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, యంత్రపరికరాల ధరలు తగ్గి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని నాదెండ్ల పీఏసీఎస్ ఛైర్మన్ నల్లమోతు హరిబాబు చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాదెండ్లలో జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సవరించిన జీఎస్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ సల్మాన్, ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఏవో శ్రీలత, డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు, ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, వీఆర్వో అబ్దుల్‌బాషా పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ట్రాక్టర్ ర్యాలీ

వినుకొండ: పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ట్రాక్టర్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ సహాయవ్యవసాయ సంచాలకులు సీహెచ్. రవికుమార్, వినుకొండ తహసీల్దార్ సురేష్‌కుమార్, ఉద్యానవన అధికారి రసూల్, ఏవో వరలక్ష్మి మట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందర్‌రెడ్డి, డీటీ మురళీధర్, ఆర్ఐ శ్రీహరి, ఏఈవో ఆరిఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాపూజీ ఆశయాలే స్ఫూర్తి

యడ్లపాడు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గురువారం యడ్లపాడు పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ టి.శివరామకృష్ణ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటీష్ వారిని ఎదురించి, శాంతియుతంగా పోరాడి చరిత్రలో మహోన్నత వ్యక్తి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ అన్నారు. ఆయనను అందరూ ప్రేమగా బాపూజీ అని పిలుస్తారని, బాపూజీ భారతదేశంలోనే కాకుండా ప్రపంచచరిత్రలోనూ తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ చేసిన ఉద్యమాలు, సంస్కరణలు గుర్తు చేసుకున్నారు. స్వదేశీ విధానం, గ్రామాల అభివృద్ధి, సమైక్యత భావాన్ని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయుల ఆలోచనలు, ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


స్వస్థనారి స్వస్థ అభినయ్ పరివార్ ఆరోగ్య శిబిరం

నరసరావుపేట రూరల్: శక్తివంతమైన కుటుంబమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారి స్వస్థ అభినయ్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.సోమ్లానాయక్ తెలిపారు. రావిపాడు–2 అయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో రెడ్డినగర్‌లో గురువారం స్వస్థ నారి స్వస్థ అభినయ్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరానికి హజరైన మహిళలకు బీపీ, షుగర్, క్షయ, సీక్కెల్ సెల్ అనేమియా, నోటి క్యాన్సర్, రొమ్ము కాన్సర్, గర్భాశయ వంటి క్యాన్సర్ పరీక్షలు జరిపారు. స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సోమ్లానాయక్ తెలిపారు. మహిళలు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. శిబిరంలో ఏఎన్ఎంలు మాధవి, నాగమల్లేశ్వరి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో 17వ విడత సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని జయంతిరామాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల తనిఖీలను పూర్తిచేసి, గ్రామ సభ నిర్వహించారు. 33 పంచాయతీల్లో 20 కి పైగా పంచాయతీ ల్లో గ్రామ సభలు ముగిచాయి. ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలు, పంట కాలువలు, పొలాల్లో నీటి కుంటలు, ఉద్యాన పంటలు,గోకులం షెడ్లు, తదితర పనులు అధికంగా చేశారు.గ్రామ సభ ల్లో మస్టర్, జాబ్ కార్డులు ల్లో లోపాలు, పనుల సమయంలో ఫోటోలు ఏర్పాటు వంటి వాటిలో తేడాలు ఉన్నట్లు గ్రామ సభల్లో నివేదిక ను చదివివినిపించారు.

ట్రెక్కింగ్‌లో గణపవరం విద్యార్థుల ప్రతిభ



నాదెండ్ల: ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అరకులో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. గత నెల 22 నుండి దసరా సెలవులను పురస్కరించుకుని పది రోజుల పాటూ ఉత్తరాంధ్రలోని అరకులో ఆలిండియా ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్ ట్రెక్–2 నిర్వహించారు. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుతున్న కె.ప్రసన్న, ఎం.శ్రీహర్ష, సలాజ్‌బాబు, వి.దినేష్, వి.జశ్వంత్, ఎన్.అన్వర్ విజయవంతంగా ట్రెక్కింగ్ పూర్తి చేశారు.

ఆయుధ పూజాం కరిష్యే..

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లలో గురువారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాల ఎదుట తుపాకులు, లాఠీలు, ఇతర పరికరాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ హైమారావు మాట్లాడుతూ విజయదశమి రోజు ఆయుధ పూజ నిర్వహించటం దుష్టశక్తులపై సాధించిన విజయానికి గుర్తు అన్నారు. యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలకు గౌరవం తెలిపే విధంగా ఆయధ పూజ చేసే ఆచారం వస్తుందన్నారు. వృత్తి పరంగా వినియోగించే పరికరాలను ఆయుధంగా పరిగణిస్తారన్నారు. దుష్టశక్తులపై న్యాయం కోసం ఆయుధాలను వాడాలన్న సంకల్పంతో పూజ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు, లేఖ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఆయుధ పూజలో ఎస్ఐ అరుణ, వంశీకృష్ణ, ఏఎస్ఐ ఇమాం, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ టి.శివరామకృష్ణ, సుస్మిత దంపతులు, సిబ్బంది పాల్గొని పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. –నరసరావుపేట టౌన్/యడ్లపాడు



ఆయుధ పూజ నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ హైమారావు, ఎస్ఐలు హరిబాబు, లేఖ ప్రియాంక



యడ్లపాడులో పూజ చేస్తున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ దంపతులు